క్లుప్తంగా

బాధిత కుటుంబానికి మంత్రి చేయూత



సరుకులు అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వెల్గటూర్: మండల కేంద్రానికి చెందిన గాడి పెల్లి దేవయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబ పరిస్థితిని బీఆర్ఎస్ నాయకుడు పెద్దూరి భరత్ మంత్రి కొప్పుల దృష్టికి తీసుకెళ్లగా మంత్రి కొప్పుల ఆదేశాను సారం సోమవారం నిర్వహించే దేవయ్య పెద్ద ఖర్మ కార్యక్రమానికి సరిపడా సరుకులు పంపించారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు జూపాక కుమార్, గుండ జగదీశ్వర్, బందెల రాజయ్య, బందెల నర్సయ్య, రాజయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ కాపీ అందజేత



ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న ఎమ్మెల్సీ

సారంగాపూర్: మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రూ. 5 లక్షలు మంజూరు కాగా, సంబంధిత ప్రొసీడింగ్ కాపీని ఆదివారం గ్రామస్తులకు అందజేశారు. అనంతరం రేచపల్లి గ్రామానికి చెందిన బోదనపు రంజిత్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆయనను ఎమ్మెల్సీ పరామర్శించారు. ఆయన వెంట యువజన కాంగ్రెస్ నాయకులు పాంపర్తి రంజిత్, బేర మహేశ్ తదితరులు ఉన్నారు.

గంగపుత్రుల సమస్యపై న్యాయ పోరాటం



మాట్లాడుతున్న కరమ్, విజయ్ ఆజాద్

కోరుట్ల రూరల్: గంగపుత్రుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని, పరిష్కారం కాకుంటే కోర్టుకు వెళ్లి న్యాయ పోరాటం చేసి న్యాయం జరిగేలా చూస్తామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొమొరెడ్డి కరమ్, కొమొరెడ్డి విజయ్ ఆజాద్ అన్నారు. మండలంలోని అయిలాపూర్‌లో ఆదివారం గంగపుత్ర సంఘం సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గంగపుత్రులు తమ గ్రామంలోని చెరువుల సమస్యలను వారికి వివరించారు. సమస్యల పరిష్కారానికి తమవంతు సహకరిస్తామని పేర్కొన్నారు. తమ తండ్రి కొమొరెడ్డి రాములును ఆదరించినట్లు తమను కూడా ఆదరిస్తే ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వరాభి అశోక్, ఎండీ ఖాలీద్, ఎండీ రజాక్, లక్పతి తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతల పరిశీలన

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూర్‌లో నిర్మిస్తున్న కమ్యూనిటీ ఇంకుడు గుంతల పనులను ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్ ఆదివారం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఎస్‌జీ 2023 సర్వేను సమీక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ వనత దుపుల అంజయ్య, కార్యదర్శి ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలి



మాట్లాడుతున్న యూత్ నాయకులు

పెగడపల్లి: సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరిస్తూ బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మండలంలోని నంచర్లలో శనివారం మండల బీఆర్ఎస్ యూత్ విభాగం సమావేశం అధ్యక్షుడు సంతోష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలో మంత్రి ఈశ్వర్ చొరవతో అన్ని గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులపై ఆయా గ్రామాల్లోని పార్టీ శ్రేణులు ప్రచారం చేయాలన్నారు. నాయకులు గోలి సురేందర్‌రెడ్డి, వెంకన్న, వేణుగోపాల్, అంజనేయులు, వేణుగౌడ్, రాజశేఖర్, శ్రీనివాస్, తిరుపతి, సునీల్, మహేందర్ పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో బోనాలతో విశ్వబ్రాహ్మణులు



ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తిలో బోనాల ఊరేగింపులో భక్తులు

బోనమెత్తిన పల్లెలు



కోరుట్లలో బోనాలతో భక్తులు

కోరుట్ల రూరల్/మల్లాపూర్/మెట్‌పల్లి/ఇబ్రహీంపట్నం/కథలాపూర్: కోరుట్ల మండలంలోని యూసుఫ్‌నగర్‌లో ఆదివారం అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. కోరుట్ల మండలంలోని మోహన్‌రావుపేటలో ఆదివారం గుండేలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. మల్లాపూర్ ఆదివారం శ్రీ కనక దుర్గ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బోనాల వేడుకలను వైభవంగా నిర్వహించారు. సిరిపూర్‌లో పోచమ్మ తల్లికి బోనాలు చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తిలో పోచమ్మ బోనాల్లో భాగంగా వలలతో సందడి చేశారు. కథలాపూర్ మండలం చింతకుంటలో రామరాట పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు.



కథలాపూర్ : చింతకుంటలో రామరాట పోచమ్మ బోనాల్లో గ్రామస్తులు

భారత్‌కు పూర్వ వైభవమే ఆర్ఎస్ఎస్ ధ్యేయం



మాట్లాడుతున్న డాక్టర్ శంకర్

రాయికల్: భారతదేశాన్ని విశ్వగురు స్థానంలో నిలిపి పూర్వవైభవం తీసుకురావడమే ఆర్ఎస్ఎస్ ధ్యేయమని జిల్లా సంఘ చాలక్‌లు డాక్టర్ భీమనాతి శంకర్, డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాయికల్, భూపతిపూర్ గ్రామాల్లో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువును గౌరవించినప్పుడే సమాజంలో ఎదుగుతారని పేర్కొన్నారు. ఉత్తమ పౌరులను తీర్చిదిద్దేది గురువులు అన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు స్వామియాదవ్, తోపారపు రవీందర్, కుర్మ మల్లారెడ్డి, ఎద్దండి ముత్యంరాజు, గంగాధర్ పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

కోరుట్ల: పట్టణంలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. ఏబీవీపీ ఆవిర్భావ నేపథ్యాన్ని నాయకులు వివరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి మాడవేణి సునీల్, జోనల్ ఇన్‌చార్జి మామిడిపల్లి పవన్, సంజీవ్, మహాదేవ్, తరుణ్, మాసం వినయ్, మాదవేణి పవన్, సూరజ్, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

నూతన మాస్టర్ ప్లాన్ అమలయ్యేనా?

- గ్రీన్, ఇండస్ట్రియల్ జోన్లలో అనుమతులకు ఇబ్బందులు
- పెండింగ్‌లో మాస్టర్ ప్లాన్ నివేదిక



రాయికల్ పట్టణం

రాయికల్: మున్సిపాలిటీలో నూతన మాస్టర్ ప్లాన్ అమలులో తీవ్ర జాప్యం ఎదురు కావడంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మేజర్ గ్రామపంచాయతీ 2018లో మున్సిపాలిటీగా ఏర్పడింది. అప్పుడు రూపొందించిన మాస్టర్ ప్లాన్‌పై ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం కావడంతో భూములు కొనుగోలు చేసిన వారు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏడాది క్రితం నూతన మాస్టర్‌ప్లాన్‌పై కౌన్సిల్ ఆమోదం తెలిపినప్పటికీ ఉన్నతాధికారులు ఆమోదించకపోవడంతో గ్రీన్‌బెల్ట్, ఇండస్ట్రియల్ ఆరెంజ్ జోన్‌లో భూమి కొనుగోలు చేసిన వారు ఇళ్లు కట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పది జోన్లుగా ఏర్పాటు

రాయికల్ మున్సిపాలిటీగా ఏర్పడ్డ తర్వాత పట్టణాన్ని పది జోన్లుగా ఏర్పాటు చేశారు. ఇందులో రెసిడెన్షియల్, కమర్షియల్, ఇండస్ట్రియల్, పబ్లిక్ అండ్ సెమిపబ్లిక్, ట్రాన్స్‌స్ట్రక్షన్ అండ్ కమ్యూనికేషన్, వాటర్ సోర్స్, గ్రీన్ బెల్ట్, గ్రేవీయార్డ్, రోడ్స్, అర్బన్‌సెబుల్, అగ్రికల్చర్ జోన్లుగా గుర్తించారు.

జోన్ల వారీగా ఏరియాలు

రాయికల్ మున్సిపాలిటీలో మాస్టర్ ప్లాన్ ప్రకారం జోన్ల వారిగా ఏరియాలను గుర్తించారు. ట్రాన్స్‌స్ట్రక్షన్ అండ్ కమ్యునికేషన్ జోన్‌లో జగిత్యాల రోడ్ నుంచి పెట్రోల్‌బంక్ వరకు, ఎర్రకుంట, పోతిన్‌కుంట, న్యూబస్టాండ్ ఏరియా, పరిసర ప్రాంతలు, గ్రీన్ బెల్ట్‌లో జన్మయ చెరువు, అయ్యప్ప మందిరం, పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో ఆఫీసు, పోలెన్‌కుంట, నాగులకుంట, ఆకిరేడుకుంట, రామాజీపేట రోడ్, ఎర్రకుంట, ఇండస్ట్రియల్ జోన్‌లో అపోసిట్ అయ్యప్పస్వామి టెంపుల్, పాలెన్‌కుంట పరిసర ప్రాంతాలు, గౌరిశంకర్ రైస్‌మిల్లు, సహరబాయి బీడీ కంపెనీ వంటి ప్రాంతాలను గుర్తించారు.

గ్రీన్‌బెల్ట్, ఇండస్ట్రియల్ జోన్‌లో కొనుగోలుదారులకు ఇబ్బందులు

మున్సిపాలిటీలోని మాస్టర్ ప్లాన్ ప్రకారం గ్రీన్ బెల్టు, ఇండస్ట్రియల్ జోన్‌లో భూములు కొనుగోలు చేసిన వారు నిర్మాణాలు చేపట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రీన్‌బెల్ట్‌లో కుంటలకు సంబంధించిన భూములు ఉండటంతో ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని, ఒక వేళ నిర్మాణాలు చేపడితే పర్మిషన్ ఇవ్వబోమని అధికారులు చెబుతున్నారు. ఇండస్ట్రియల్ ఏరియాలో కేవలం పరిశ్రమలకు సంబంధించిన నిర్మాణాలే చేపట్టాలని మాస్టర్ ప్లాన్‌లో రూపొందించారు. దీంతో కొనుగోలుదారులు లక్షలు వెచ్చించి భూములు కొనుగోలు చేయడంతో ప్రస్తుతం ఈ జోన్లతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్ ద్వారా పట్టణ ప్రజల అభిప్రాయం తెలియకుండా ఆమోదించారని, ప్రస్తుతం పట్టణ ప్రజల అభిప్రాయం తెలుసుకుని జోన్లలో మార్పులు చేయాలని, అదేవిధంగా ఇండస్ట్రియల్ జోన్లలో నిర్మాణం చేపట్టిన వారికి అనుమతులు ఇచ్చి, ఇంటి నంబర్లు కేటాయించాలని బాధితులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పందించి నూతన మాస్టర్ ప్లాన్ అమలయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రాయికల్ మున్సిపాలిటీ	
వార్డులు :	12
జనాభా :	19,500
గృహాలు :	4680

ఇళ్ల అనుమతి రావడం లేదు



రాయికల్ మున్సిపల్‌గా ఏర్పడిన తర్వాత గ్రీన్ బెల్ట్ ఇండస్ట్రియల్ జోన్లలో ఇళ్లు కట్టుకోవాలనుకునే మాలాంటి నిరుపేదలకు మున్సిపల్ వారు అనుమతులు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. పలుమార్లు మున్సిపల్ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండాపోయింది.

– ఇంతియాజ్, బాధితుడు

సీడీఎంఏ దృష్టికి తీసుకెళ్లాం



రాయికల్ మున్సిపాలిటీలో గతంలో ఉన్న మాస్టర్ ప్లాన్‌లో ఉన్న జోన్ల ప్రక్రియతో ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న కౌన్సిలర్లంతా జోన్ల మార్పిడిపై తీర్మానం చేసి నూతన మాస్టర్‌ప్లాన్ అమలుపై సీడీఎంఏ దృష్టికి పంపించాం. అనుమతి రాగానే అమలు చేస్తాం. ఎవరూ ఆందోళన చెందవద్దు.

– సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

సాయిచంద్ మరణం బహుజనులకు తీరని లోటు



సాయిచంద్ సంస్మరణ సభలో దళిత నాయకులు

జగిత్యాలటౌన్: సాయిచంద్ మరణం బహుజన సమాజానికి తీరని లోటని దళిత సంఘాల నాయకులు అన్నారు. ఎస్సీ వెల్ఫేర్, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం జగిత్యాల అంబేద్కర్ భవన్‌లో సాయిచంద్ సంస్మరణ సభ నిర్వహించారు. సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ దళిత బహుజన ఉద్యమ నాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ గుండె పోటుతో మరణించడం సాహితీ లోకంతో పాటు, బహుజన సమాజానికి తీరని లోటన్నారు. రాజకీయంగా ఎదిగే క్రమంలో సాయిచంద్ ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో మాలల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు బొల్లం విజయ్‌కుమార్, వెంకటరమణ, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాయితి శంకర్, ఉపాధ్యక్షుడు కాయితి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గాన్ని సన్మానించిన సభ్యులు

కోరుట్ల: లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా వనపర్తి చంద్రమోహన్, కార్యదర్శిగా కుందారపు మహేందర్, కోశాధికారిగా కొండబత్తిని అనంత కృష్ణ ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. లయన్స్ మహిళా క్లబ్ కోరుట్ల కోటి నవదుర్గ అధ్యక్షురాలిగా వనపర్తి రమ్య, కార్యదర్శిగా కుందారపు ప్రేమలత, కోశాధికారిగా కొండబత్తిని రాధిక ప్రమాణం చేశారు. కార్యక్రమంలో ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్ గవర్నర్ లయన్ చిదుర సురేశ్, జిల్లా నాయకులు ఎం. రమణ రెడ్డి, డీసీఎస్ కెప్టెన్ మధుసూదన్, మోర భద్రేశం, జోన్ చైర్మన్ అల్లాడి శోభ, నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్‌లో..

కథలాపూర్: లయన్స్‌క్లబ్ కథలాపూర్ మండల నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా రిక్కల సంజీవ్‌రెడ్డి, కార్యదర్శిగా తిపిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా పిడుగు సంజీవ్‌రెడ్డి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గసభ్యులు సామాజిక సేవల్లో పాలుపంచుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగం భూమయ్య, లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు మామిడిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, తాళ్లపెల్లి సతీశ్‌గౌడ్, అల్లె పరమేశ్వర్, కొమ్ముల కిషన్‌రెడ్డి, మామిడిపెల్లి రవి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణలో సీఎం కేసీఆర్

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



బ్రహ్మగర్జనసభ బస్సుకు జెండా ఊపుతున్న ఎమ్మెల్యే

జగిత్యాలటౌన్: హింధూధర్మ పరిరక్షణకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన బ్రహ్మ గర్జన సభకు జగిత్యాల నుంచి తరలివెళ్తున్న వాహనాలకు ఎమ్మెల్యే డా సంజయ్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ బ్రాహ్మణ వర్గాల సంక్షేమంతో పాటు హైందవ ధర్మ పరిరక్షణకు విశేష కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిరిసిల్ల శ్రీనివాస్, జగిత్యాల రూరల్ ఎంపీపీ రాజేంద్రప్రసాద్, ఉమాపతి శర్మ, వేణుమాధవ్ ఉన్నారు.

బోనాల పండుగల్లో ఎమ్మెల్యే

పట్టణంలోని పలు వార్డుల్లో జరిగిన పోచమ్మ బోనాల సంబరాల్లో జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఆదివారం జగిత్యాల పట్టణం 9వ వార్డు శ్రీలోకమాత అచ్చుబండ పోచమ్మ బోనాలు, 2వ, 17వ వార్డు మైసమ్మ గడ్డ ప్రజలు నిర్వహించిన పోచమ్మ బోనాల పండుగల్లో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో బల్దియా చైర్‌పర్సన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు వొద్ది శ్రీలత, పద్మ, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సీడీ ఆవిష్కరణ

నాలుగేళ్లలో జగిత్యాల నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు నేత్రవైద్యుడిగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చేస్తున్న సేవలపై జగిత్యాల పట్టణానికి చెందిన లవంగ రాజేందర్ రూపొందించిన సీడీని ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బల్దియా చైర్మన్ గోళి శ్రీనివాస్, కౌన్సిలర్ బొడ్ల జగదీష్, రూరల్ ఎంపీపీ రాజేంద్రప్రసాద్, యూత్ అధ్యక్షుడు గిరి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్: మండలంలోని స్తంభంపల్లి గ్రామానికి చెందిన భూపెల్లి విజయ్‌కు ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని ఆదివారం డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యంతో పాటు, పిల్లల చదువు బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రశాంత్, జానీ గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె

ధర్మపురి: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై చేపట్టిన సమ్మె ఆదివారం నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ దశాబ్దం నుంచి కార్మికులు సమస్యల పరిష్కారానికి నోచుకోలేక పోతున్నాయని అన్నారు. కార్మికులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని, మృతి చెందిన కార్మికుల కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు మామిడి గంగన్న, జలిపెల్లి సురేశ్, గంగన్న, రాజేందర్ తదితరులున్నారు.

నియోజకవర్గంలో సంఘాల అభ్యున్నతికి కృషి

మెట్‌పల్లి: నియోజకవర్గంలో అన్ని సంఘాల అభ్యున్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మండలంలోని వెల్లుల్లలో ఆదివారం పీఎంపీ, ఆర్ఎంపీ అసోసియేషన్ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. భవన నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించానని, భవిష్యత్తులో మరిన్ని నిధులు కేటాయిస్తానన్నారు. ఎంపీపీ సాయిరెడ్డి తదితరులున్నారు.

చైతన్యంగా ఉంటేనే కులసంఘాలు అభివృద్ధి

కథలాపూర్: పద్మశాలీ కులస్తులు చైతన్యంగా ఉంటేనే కుల సంఘం అభివృద్ధి చెందుతుందని ఆ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం మేడిపెల్లి లో పద్మశాలీ సంఘం సమావేశం జరిగింది. మార్కండేయ ఆలయం నిర్మాణం పూర్తయ్యేందుకు అందరూ కలిసి ముందుకు సాగాలన్నారు. సమావేశంలో మండల సంఘం ప్రతినిధులు కుందెన సత్యనారాయణ, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితురాలి వైద్యానికి ఆర్థికసాయం

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్రాపూర్‌లో ఉంటున్న లింగాల ప్రమీల అనారోగ్యానికి గురై మంచం పట్టింది. లింగాల ప్రమీలతో కలిసి 2002–03 విద్యాసంవత్సరంలో మేడిపెల్లి జెడ్పీ హైస్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ కలిసి ఆదివారం రూ. 33,111 ఆర్థికసాయం అందించారు.

ఆలయ నిర్మాణానికి రూ. 10 వేలు విరాళం

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఫకీర్ కొండాపూర్‌లో మార్కండేయ ఆలయం నిర్మాణానికి నిర్మల్ జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుడ్ల రామకృష్ణ రూ. 10 వేలు విరాళం ఆదివారం అందించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం మండల కమిటీ ఎన్నిక

కొండగట్టు: రెడ్డి సంఘం మండల కార్యవర్గంను ఆదివారం అక్షయ గార్డెన్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడ్డం చంద్రమోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఉట్కూరి మల్లరెడ్డి పుండ్ర సంజీవరెడ్డి చల్ల శ్రీనివాస రెడ్డి రేకుల పల్లి తిరుపతిరెడ్డి అనుమండ్ల అజయ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మంద గోపాల్ రెడ్డి, కార్యదర్శులుగా స్వామిరెడ్డి, లక్ష్మారెడ్డి, గట్ల మల్లారెడ్డి, సురకంటి ముత్యంరెడ్డి కోస్న రమణరెడ్డి, కోశాధికారిగా పాశాపు కిషన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా పలువురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


సిరికొండ మజీద్ కమిటీ నూతన కార్యవర్గం

కథలాపూర్: మండలంలోని సిరికొండ మజీద్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ సలీం, ఉపాధ్యక్షుడిగా ఎండీ సలీమొద్దీన్, ప్రధానకార్యదర్శిగా ఎండీ అమీర్‌ఖాన్, కార్యవర్గసభ్యులుగా పలువురు ఎన్నికయ్యారు.

అంబేడ్కర్ సంఘ భవనానికి రూ. పది లక్షలు మంజూరు

ధర్మపురి: పట్టణంలో నూతనంగా నిర్మించనున్న అంబేడ్కర్ సంఘ భవనానికి రూ.పది లక్షల నిధులు మంత్రి కొప్పుల ఈశ్వర్ మంజూరు చేయించారని జెడ్పీటీసీ బత్తిని అరుణ తెలిపారు. ఈసందర్భంగా కుల సంఘ నాయకులు ఆదివారం జెడ్పీటీసీ ఆధ్వర్యంలో మంత్రి ఈశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బొల్లారపు సంజీవ్, ముప్పట్ల రాజేందర్, ఉపారపు రాజమల్లు, దొబ్బల శేఖర్ తదితరులున్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఎస్సై

జగిత్యాలక్రైం: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ అన్నారు. ఆదివారం జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌లో వాహనదారులకు హెల్మెట్, మైనర్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడుపవద్దని ప్లకార్డులతో వాహన దారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి ఇన్సూరెన్స్ తప్పకుండా ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగ్గా ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని, త్రిబుల్ రైడింగ్, మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు సంబవిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై శంకరయ్య, సర్పంచ్ అంకం మమత, తిమ్మాపూర్ ఎంపీటీసీ గిద్దె లక్ష్మి పాల్గొన్నారు.